క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



కూర్మినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలో ఆమదాలవలస గ్రామానికి చెందిన యర్రాపాత్రుని కూర్మినాయుడు ఇటీవల మృతిచెందారు. కూర్మినాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కూర్మినాయుడు మృతికి గల కారణాలను ఆయన కుమారులు తేజేశ్వరరావు, అనీల్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, ఉపసర్పంచ్ మామిడి రాంబాబు, మామిడి వేణుగోపాలరావు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ



రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

వంగర: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డి.ఐజాక్ కోరారు. మండల కేంద్రంలోని రైస్‌మిల్లును ఏఓ తట్టికోట కన్నబాబుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. వివిధ గ్రామాల రైతులు నుంచి సేకరించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు.

వాహనాల తనిఖీ



బూరాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: మండలంలో బూరాడ జంక్షన్ వద్ద ఎస్ఈబీ అధికారులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. రాజాం ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, గుట్కా, మద్యం తరలింపుపై నిఘా పెట్టినట్లు చెప్పారు. నిషేధిత ఉత్పత్తులను తరలించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో ప్రతిభ



సురేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి గణిత క్విజ్ పోటీల్లో రాజాంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన పోటీల్లో పాగిరి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జద్దు సురేష్, డోలపేట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సీహెచ్ హర్షవర్ధన్, పి.పురుషోత్తంనాయుడు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పాగిరి పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణతో పాటు, ఉపాధ్యాయులు వల్లూరు దాలినాయుడు, డి.నాగరాజు తదితరులు అభినందించారు.

నేడు తెలగ కులస్తుల వనభోజనాలు



తెలగ సామాజిక వర్గ సభ్యులతో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

బొబ్బిలి: తెలగ సామాజికవర్గ సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 17న కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు చెప్పారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి బొబ్బిలి రాణిగారి తోటలో నిర్వహించే ఈ వనమహోత్సవానికి తెలగ సామాజిక వర్గానికి చెందిన వారంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నూతన కార్యవర్గంతో పాటు అజెండాను ప్రకటించనున్నట్లు చెప్పారు.

ఆహారం పంపిణీ



ఆహారం పంపిణీ చేస్తున్న గోవిందరావు

బొబ్బిలి: స్థానిక సీహెచ్‌సీలో వైద్య సేవలు కోసం వచ్చిన రోగులకు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, వైఎస్సార్‌సీపీ నాయకులు రాముద్రి గోవిందరావు శనివారం ఆహారం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, రోగులు, వారి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

పారదర్శక విధానంలో ధాన్యం కొనుగోలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి: ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గోపాలరాయుడిపేట, చిత్రకోట బొడ్డవలస ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలులో గత ప్రభుత్వం కన్నా మెరుగైన విధానాలు తీసుకువచ్చినట్టు చెప్పారు. గోనె సంచులకు, రవాణాకు ఛార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సాధారణ రకానికి క్వింటా రూ. 2183లు, గ్రేడ్ ఏ రకానికి రూ.2203లు చొప్పున 21 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందరరావు, ఎంపీటీసీ మర్రాపు సీతారాం, చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ చొంగలి రామకృష్ణ, సచివాలయ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి, కమ్మవలస గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు శనివారం ప్రారంభించారు. రైతులు పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వమే ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. రైతులు ఆర్‌బీకే సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీరాములు, కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుంధర, కోమటిపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలమల సింహాచలం, సచివాలయ కన్వీనర్, కొల్లి సింహాచలం, గొట్టాపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: ధాన్యం బస్తాలను తూకం వేస్తున్న శంబంగి వేణుగోపాలనాయుడు



బాడంగి: వాడాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం..

బాడంగి: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని వాడాడ రైతుభరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజుల్లో బిల్లులు చెల్లించనున్నట్లు చెప్పారు. దళారీలకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని రైతులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పూడి సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ పూడి కృష్ణమూర్తి, గొట్టాపు రామారావు, రిటైర్డ్ వీఆర్‌ఓ సత్యం, తహసీల్దార్ రఫీజాన్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఏఓ శిరీష, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాలన సాగిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మరోసారి ఆయన్ను ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని కూనాయవలసలో శనివారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేసిన లబ్ధిని తెలియజేసే పత్రాలను అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను వందశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నవరత్న పథకాలతో రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబంలో నవ్వులు నింపారన్నారు. ప్రజా సంక్షేమ, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మద్దతివ్వాలని, మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, ఎంపీటీసీ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు నర్సుపల్లి బాబ్జీరావు, గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, కూనాయవలస మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డీవీ అప్పారావు, తహసీల్దార్ బి.రత్నకుమార్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో సవరణలపై దృష్టి

బాడంగి: ఒక వ్యక్తికి ఒకే చోట ఓటుహక్కు కలిగి ఉండాలన్న నిబంధన మేరకు రెండుచోట్ల ఓటుహక్కు ఉన్నవారిపై రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మండలంలో ఓటుహక్కు ఉన్నవారిలో కొంత మందికి ఇతర జిల్లాలు, మండలాల్లో కూడా ఓటుహక్కు ఉండటాన్ని గుర్తించి వారికి నోటీసులు జారీచేస్తున్నారు. ఏదో ఒకచోట మాత్రమే ఓటుహక్కు ఉంచుకోవాలని సూచిస్తున్నారు. మండలంలో రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారు 965 వరకు ఉన్నట్లు గుర్తించామని తహసీల్దార్ అజురఫీజాన్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా సవరణకు ఈ నెల 26 వరకు గడువు ఉన్నందున దీనిపై దృష్టిపెట్టినట్లు చెప్పారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

రాజాం: మండలంలో శ్యాంపురం, ముద్దాడ జోగివలస, గార్రాజుచీపురుపల్లి, బొద్దాం, పొగిరి తదితర గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలు నిర్వహించారు. డీఆర్‌పీ బృందం గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనుల వివరాలు సేకరించారు. మండలంలో రూ.15 కోట్లుతో ఉపాధి పనులు చేపట్టినట్లు ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. ఎస్ఆర్‌పీ ఎస్.చిన్నబ్బాయి పర్యవేక్షణలో ఆడిట్ సిబ్బంది సమాజిక తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు.

ఫీజు చెల్లింపునకు గడుపు పెంపు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ(మద్రాస్) ఆధ్వర్యంలో నిర్వహించే హిందీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు శనివారం తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ స్థాయిలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరిలో పరీక్షలు ఉండాయని తెలిపారు. ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ 99499 17365ను సంప్రదించాలని కోరారు.

సచివాలయ సిబ్బందిదే బాధ్యత

మెంటాడ: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు భోజనం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని ఎంపీడీఓ త్రివిక్రమ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం 19 గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కేంద్రాలను నిర్వహించడమే కాకుండా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి సంబంధించి సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు చర్యలు



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి



బాడంగిలో ఇన్‌ఛార్జ్‌లు,కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ. ఆంజనేయులు

రామభద్రపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ రమామణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ అక్కారావుతో కలిసి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. సచివాలయ సిబ్బందిలో ఒకరిని ఫంక్షనల్ అసిస్టెంట్‌గా నియమించి పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫంక్షనల్ అసిస్టెంట్లు పాఠశాలలో చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తీసుకొచ్చి చిన్నారులకు పెట్టాలన్నారు. వలంటీర్ల సహకారంతో టీహెచ్‌ఆర్ పంపిణీ చేయాలన్నారు. కేంద్రాలలో చిన్నారులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి కేంద్రాల నిర్వహణను పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

- బాడంగి: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలని ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి అన్నారు. కేంద్రాలను తెరిచే బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించినట్లు చెప్పారు. సచివాలయ సిబ్బందిలో ఒకరిని అంగన్‌వాడీ ఇన్‌చార్జ్‌గా నియమించడం జరిగిందని, వారు ఉదయం 9 గంటలకు కేంద్రాలను తెరిచి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వంగర: మండలంలోని తలగాంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో పార్టీ జెండా ఎగురువేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే డాష్‌బోర్డును ఆవిష్కరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నిలవాలి కోరారు.

నేడు పెన్షనర్ల దినోత్సవం

బొబ్బిలి: పట్టణంలోని కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామ్మూర్తినాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం బొబ్బిలి మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పెన్షనర్లంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

- రాజాం: పట్టణంలోని సీతారామ థియేటర్ పక్కన ఉన్న మారుతీ సప్లయర్స్ మేడపై ఆదివారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏజీపీఏ పెన్షనర్ల అసోసియేషన్ రాజాం శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని పెన్షనర్లంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో వైద్యసేవలు



వన్నలిలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలో పలు గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లో ఏఎస్ఎంలు, ఆరోగ్య కార్యదర్శులు, మిడ్ లెవెల్ హెల్త్ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సచివాలయ వ్యవస్థతో సరికొత్త చరిత్ర



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలో ఆగూరు గ్రామంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతంలో ఏ గ్రామంలోనూ పంచాయతీ భవనాలు ఉండేవికాదని, అటు అధికారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీ పంచాయతీలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారని అన్నారు. రూ.90 లక్షలు నుంచి రూ.1 కోటి నిధులతో శాశ్వత భవనాలు నిర్మించినట్లు చెప్పారు. ప్రతీ సచివాలయంలో 10 నుంచి 12 మంది సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేశారని, పార్టీలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాయన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పాల్సిన సమయం వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. ప్రభుత్వంపై అక్కసుతో ప్రతిపక్షాలు లేనిపోని అభూతకల్పనచేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిని ప్రజలు నమ్మొద్దని కోరారు. రాజాం ప్రధాన రహదారి విస్తరణతో పాటు రాజాం-పాలకొండ ప్రధాన రహదారి నిర్మాణం కూడా సకాలంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, స్థానిక సర్పంచ్ కోనారి అనూష, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్‌లు వంజరాపు విజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పీఆర్ జేఈ ప్రభాకరరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ రేను కాసాయి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు చేరుకోవాలి



వాడాడ జగనన్న కాలనీలో హౌసింగ్ డే కార్యక్రమం

బాడంగి: గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేందుకు ఇంజినీరింగ్ సహాయకులకు అప్పగించిన వారాంతపు లక్ష్యాలను సిబ్బంది విధిగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు ఆదేశించారు. మండలంలోని వాడాడ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో జనవరి నెలాఖరులోగా 152 ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించగా.. ప్రస్తుతం 32 నిర్మాణాలు మాత్రమే పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు బిల్లు చెల్లింపులో జప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైన సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ సత్యం, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఇంజినీరింగ్ సహాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ లబ్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం 1,10,118 మంది లబ్ధిదారులకు డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో సుమారు రూ.323.05 కోట్లు పంపిణీ చేసిందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణితో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక పేదల ఇంట పథకాల పంట పండిందన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, పంటల బీమా, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా, పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, కళ్యాణమస్తు, ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ బీమా, వాహన మిత్ర తదితర సంక్షేమ పథకాల ద్వారా సుమారు 84,695 మందికి రూ.247.80 లక్షలు నేరుగా వారి ఖాతాలకు జమ అయ్యాయన్నారు. అలాగే ఇంటి పట్టాలు, విద్యాకానుక, ట్యాబ్‌లు, జగనన్న తోడు, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ తదితర పథకాలతో 25,423 మంది లబ్ధిదారులకు రూ.75.25 కోట్లు నాన్ డీబీటీ రూపంలో అందాయని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అర్హత ఉంటే పథకాలే గడపను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. దళారుల దందా, అధికారులు చేతివాటం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు పథకాలను అందించడం జరిగిందన్నారు. పథకాలు పొందిన వారంతా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం



బిడ్డను చూపుతున్న ఈఎంటీ విశ్వనాథం

వంగర: మండలంలోని కొప్పరవలస పంచాయతీ బంగారువలస గ్రామానికి చెందిన గర్భిణి ముద్రాకుల దేవి 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. శనివారం ఉదయం ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. ఈఎంటీ విశ్వనాథం తల్లీ బిడ్డకు ప్రాథమిక వైద్య సేవలు అందించి, అనంతరం ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

ముమ్మరంగా వరి నూర్పులు



యంత్రాలతో వరిపంట నూర్పిడి చేస్తున్న రైతులు

సంతకవిటి: మండలంలోని పలు గ్రామాల్లో వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రైతులు పంటకోతలు పూర్తి చేసి పొలాల్లోనే కుప్పలుగా వేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపడుతుండడంతో యంత్రాల సాయంతో నూర్పులు చేస్తున్నారు. సంతకవిటి, మందరాడ, కొండగూడెం, బూరాడపేట తదితర గ్రామాల్లో వరి నూర్పులు జోరందుకున్నాయి.

వరి కోసం వర్రీ

మెంటాడ: ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట తుపాను వర్షాలకు తడిచి ముద్దవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు పాట్లు పడుతున్నారు. పలువురు రోడ్లపై ధాన్యం ఆరబెడుతూ కనిపించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరావు కార్యదర్శులను ఆదేశించారు. పొగిరి గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ వద్ద వివరాలు సేకరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని క్లాప్‌మిత్రులకు సూచించారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

- రేగిడి: మండలంలో బూరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, కొర్లవలస తదితర గ్రామాల్లో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేయిస్తున్నట్లు ఎంపీడీఓ శ్యామలాకుమారి తెలిపారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

వంగర: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం నిరసన తెలియజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ డి.ఐజాక్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెబాట పట్టడంతో ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులు, ఐసీడీఎస్ ఉద్యోగులతో అంగన్‌వాడీ కేంద్రాలను తెరుస్తోంది.